BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ 21-02-2025

WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు

# జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ రాసలీలలు

## భర్త వేరే మహిళతో ఉండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య

### చితకబాది పోలీసులకు అప్పగింత


### సికింద్రాబాద్ వారాసిగూడలో ఘటన



**మహా, హైదరాబాద్:** జీహెచ్ఎంసీలో జాయింట్ కమిషనర్ గా పనిచేస్తున్న జానకిరామ్ రాసలీలల వ్యవహారం బయటపడింది. వేరే మహిళతో ఉండగా అతని భార్య కల్యాణి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జానకిరామ్ తన కంటే 20 ఏళ్ల చిన్న వయసున్న అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకొని అక్కడే ఉంటుండగా భార్య పట్టుకొని ఇద్దరినీ చితకబాదింది. కుటుంబాన్ని వదిలేసి కొద్ది రోజులుగా జానకిరామ్ వారాసిగూడలో ఆ అమ్మాయితో ఉంటున్నాడు. భర్త రోజుల తరబడి ఇంటికి రాకపోవడంతో ఎక్కడికి వెళుతున్నాడని భార్య కల్యాణి నిఘా పెట్టారు. సికింద్రాబాద్ వారాసిగూడలో అపార్టుమెంట్‌లో ఉన్న ఇద్దరిని కల్యాణి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**కొత్త విషయాలు వెలుగులోకి..**

జానకీరామ్ గురించి కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో ఖమ్మం, మెదక్ లో పని చేసిన సమయంలోనూ ఇలాంటి బాగోతం నడిపినట్లు భార్య ఆరోపిస్తోంది. తనకు ఆరోగ్యం సరిగా లేదని.. అమ్మ ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయేవాడని



చెప్పారు. భర్తను ఎలాగైనా మార్చుకోవాలనే ఆలోచనతో కొట్టినట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పచ్చని సంసారంలో అక్రమ సంబంధాలు చిచ్చు పెడుతున్నాయి. ఫలితంగా గుట్టుగా సాగుతున్న కాపురాలు రోడ్డు మీదకు వస్తున్నాయి. ఒకప్పుడు చదువు లేని వాళ్లు కాదు ఈ విధంగా వ్యవహరించేవారు. ఇప్పుడు కొందరు అధికారులు ఆ విధంగా వ్యవహరిస్తుండడంతో సామాన్యులు అవాక్కు అవుతున్నారు.



# కేసీఆర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయండి

- హైకోర్టులో పిల్ దాఖలు
- స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ పిటిషనర్ అభ్యర్ధన

**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడాన్ని సవాల్ చేస్తూ.. ఆయన శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఫార్మర్స్ ఫెడరేషన్ కు చెందిన విజయ్ పాల్ రెడ్డి కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడాన్ని ప్రశ్నిస్తూ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. అసెంబ్లీకి రానప్పుడు శాసన సభ్యుడిగా ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ కోర్టును కోరారు. 2023 డిసెంబర్ 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఇప్పటి వరకు అసెంబ్లీకి రాకున్నా స్పీకర్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించేందుకు ఎమ్మెల్యేల జీతాలు కూడా పెంచారని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలను నిర్వహించలేకపోతే ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని కోర్టును కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించాలని కూడా విజయ్ పాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రతివాదులుగా కేసీఆర్, కేటీఆర్ లతో పాటు స్పీకర్, స్పీకర్ కార్యాలయాన్ని చేర్చారు. కేసీఆర్ శాసన సభ్యత్వ రద్దు పిటిషన్ కు విచారణార్హత ఉందో లేదో తేల్చేందుకు ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

# శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్ధిని బలవన్మరణం

**మహా, ఖమ్మం:** ఖమ్మం పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. శుక్రవారం ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న డీ. యోగ నందిని (17) అనే విద్యార్థిని కాలేజీ హాస్టల్‌లోని తన గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఉదయం 6.30 గంటలకు గమనించిన తోటి విద్యార్థులు.. సిబ్బందికి వెల్లడించారు. దీంతో ఆమెను పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కాగా విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు హాస్పిటల్ వద్ద ఆందోళకు



దిగారు. ఆమె కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్..

### పోలేపల్లి రేణుకమ్మ ఆలయంలో రేవంత్ రెడ్డి పూజలు

**మహా, వికారాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ క్రమంలో దుద్యాల్ మండలం పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు . ఆయనతో పాటు మంత్రులు దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పేరుతో.. దోపిడీకి ప్లాన్

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్



**మహా, పెద్దపల్లి:** ఎల్ఆర్ఎస్ పేరుతో తెలంగాణ సర్కార్ కొత్త దుకాణం పెట్టిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రభుత్వం రూ.50 వేల కోట్ల దోపిడీకి ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టి ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారని కామెంట్ చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అతి తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న అధికార కాంగ్రెస్ పార్టీకి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో పాటు నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని డబ్బులు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. బర్త్, డెత్ రెగ్యులరైజేషన్ స్కీంలను కూడా ప్రవేశపెడతారేమో అన్నారు. కేంద్ర బడ్జెట్ పై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలన్నారు. మీకు చేతనైతే బీసీ రిజర్వేషన్లపై టెన్ జనపథ్ ఎదుట ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి, బీజేపీ పోరాటాలకు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన బిజెపి పోరాటాలు చేసి లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లిన నాడు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ఎక్కడికి పోయారన్నారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఉపాధ్యాయ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను భారీ మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలనన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, అలజపూర్ శ్రీనివాస్ తో పాటు పెద్ద సంఖ్యలో బిజెపి శ్రేణులు పాల్గొన్నారు



# అందాల పోటీలను అడ్డకుంటే ఖబడ్డార్

- మహిళల అభ్యున్నతికి ఏనాడైనా పాటుపడ్డారా?
- ఉనికి కోసమే రాజకీయ డ్రామాలు
- వీహెచ్‌పీ నేతలపై చామల మండిపాటు

**మహా, హైదరాబాద్:** వీహెచ్‌పీ నేతల వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అందాల పోటీలను అడ్డుకొని వీహెచ్‌పీ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని తెలిపారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీలు మహిళల అభ్యున్నతికి ఏనాడు పాటు పడలేదని ఆరోపించారు. అందాల పోటీలు నిర్వహించే అవకాశం తెలంగాణ కు వస్తే అడ్డుకోవడం కరెక్ట్ కాదని అన్నారు. పోటీలను వ్యతిరేకించడం వీహెచ్‌పీ నేతలు మానుకోవాలని అన్నారు. ప్రపంచ దేశాలలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్నింటిలో ముందంజ లో ఉందని తెలిపారు. మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నది రేవంత్ సర్కార్ అని అన్నారు. అందాల పోటీల వలన మహిళల్లో ఆత్మవిస్వాసం పెరుగుతుందని, మీ రాజకీయల కోసం ఇలాంటి స్టేట్మెంట్స్ మానుకోవాలని వీహెచ్‌పీ నేతలను హెచ్చరించారు.

# చిరంజీవి తల్లి అంజనాదేవికి అస్వస్థత



**మహా, హైదరాబాద్:** మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు శుక్రవారం తెల్లవారుజామున ఆమెను హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ఇది ఇలా ఉంటే అంజనాదేవి అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడలో ఉన్న కార్యక్రమాలను రద్దు చేసుకుని హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన అధికారులతో నిర్వహించాల్సిన సమీక్షలను కూడా వాయిదా వేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. కాగా అంజనాదేవి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు హెల్త్ బులిటిన్ విడుదల చేయనున్నారు.

# బండి సంజయ్‌కు మతి భ్రమించింది

- కాంగ్రెస్ నేత, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఘాటు వ్యాఖ్యలు




**మహా, హైదరాబాద్:** కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మతి భ్రమించిందని, అందుకే నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేత, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్‌కి ట్రైనింగ్ అవసరమని తీవ్ర విమర్శలు చేశారు. పదే పదే కాంగ్రెస్ పార్టీ మీద విరుచుకు పడటం సరికాదని సూచించారు. ముందు మీ బీజేపీలో జరిగే అంతర్గత విభేదాల మీద దృష్టి పెట్టండి.. అంటూ విమర్శించారు. ఏది పడితే అది మాట్లాడి కేంద్ర మంత్రిగా ఉన్న మీ పరువు తీసుకోకండి.. అని హితువు పలికారు. మీ నాయకత్వాన్ని మీ పార్టీ వాళ్ళు, మీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలే పట్టించుకోవడం లేదన్నారు. మీకు రాజకీయ శిక్షణ కావాలంటే గాంధీ భవన్‌లో ఇస్తాం.. అని తీవ్ర విమర్శలు చేశారు. ముందు 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి రాకుండా చూసుకో.. అంటూ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ నేర్చుకోవాల్సింది చాలా ఉందని అన్నారు.